

# బాకీ

మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆఫీసునుంచి ఒకటో తారీకు జీతం అందుకుని ఇంటికి తిరిగివచ్చిన నరసింహానికి ఆ టెలిగ్రాం చూడగానే, జీతం అందుకున్న సంతోషం అంతా జావకారిపోయింది. నరసింహానికి భార్య అందించిందా టెలిగ్రాం. విశాఖపట్నంలోని తల్లికి సీరియస్‌గా వుందనీ, కింగ్‌జార్జ్ ఆస్పత్రిలో చేర్పించబడిందనీ, వెంటనే రమ్మనమనీ సారాంశం. నరసింహం తండ్రి ఇచ్చాడా టెలిగ్రాం.

చిన్నగా నిట్టూర్చాడు నరసింహం. భార్య అందించిన కాఫీ మౌనంగా తాగి అన్నాడు ఖాళీగ్లాసు అందిస్తూ,

"ఇద్దరం వెళ్ళాలి, తప్పదు. ఏం జబ్బో, ఏమిటో వివరంగా తెలియచెయ్యలేదా ముసలాయన. నలభై, ఎనభైదాకా అవుతాయి మనిద్దరికీ రైలు చార్జీలు, దారిలో తిండి ఖర్చులతో సహా. పైన ఓ యిరవై. మళ్ళీ తిరిగి రావడానికి ఓ ఎనభై. ఎలాలేదన్నా రెండు వందలదాకా ఎగిరిపోతుంది."

"తిరిగి వచ్చేటప్పుడు మీ నాన్నగారి దగ్గిర పుచ్చుకుందాం రైలు చార్జీలు. నెమ్మదిమీదట పంపవచ్చుతిరిగి, అంతగా అడిగితే."

"ఇక్కడ అప్పులూ? చచ్చిపోతున్నాను ఈ చాలీచాలని జీతంతో, అప్పులతో. పచారీ దుకాణంలో ఇవ్వాలి. పాలవాడికి ఇవ్వాలి. ఇంటద్దె ఇవ్వాలి. ఈ మూడూ ఎలాగూ తప్పవు. రమణారావుదగ్గర వంద పుచ్చుకుని నాలుగు నెలలు దాటుతోంది. వాడు అడగని రోజు లేదు. రేపిస్తా, మాపిస్తా అంటూ సమాధాన పరుస్తున్నాను."

## ఎప్పుడూ కోటు వేసు కుంటానులెండి

*బాబ్జీ చిత్తుగా తాగేసి బయటకు వస్తూ ఓ మధ్య వయసు వనితకు డాష్ ఇచ్చి మళ్ళీ తేరుకుని క్షమాపణలు చెప్పు కున్నాడు. ఆవిడ అతన్ని చూసి జాలి పడి కళ్ళజోడు సవరించుకుని "తాగితే కడుపు చెడిపోతుంది నాయనా" అన్నది. బాబ్జీ వెంటనే అన్నాడు, "నేను ఎప్పుడూ కోటు వేసుకుని తిరుగుతానులెండి"*

''బట్టల కొట్టువాడు ఇంటికి వుత్తరం వ్రాశాడు. మర్చిపోయారా ? ఈ నెల ఏభై ఇస్తానని సమాధానం వ్రాసిపడేశారుగా'' గుర్తుచేసింది నరసింహానికి.

''నిజమే. మన ప్రక్కింటాయనికి డెబ్భై ఇవ్వాలి. ప్చ్ ! ఓ నెలరోజులు శెలవ పెట్టి దూరంగా ఎటయినా పారిపోవాలనిపిస్తోంది.''

''ఆ వూలీవూలీ చీరసంగతి ఏ మంటారు ? తీసుకోనా ? ఈ నెల పాతిక కడితే చాలు. మళ్ళీ నెలసంగతి అప్పుడు చూసుకో వచ్చు.''

''ఈ అప్పులు చాలక అదొకటా మన పీకకి ?''

''పుట్టినరోజు కదండీ. పెళ్ళికాక పూర్వం మా ఇంట్లో తప్పనిసరిగా నాకు లంగా, ఓణీ కొనిపెట్టేవాళ్ళు తలతాకట్టుపెట్టయినా. అన్ని అప్పుల్లో ఇదొకటి.''

''నీ ఇష్టం''. అయిష్టంగా అన్నాడు నరసింహం.

బాత్‌రూంలో మొహం కడుక్కుని, మళ్ళీ చెప్పుల్లో కాళ్ళుదూరుస్తూ అన్నాడు భార్యతో,

''నేను స్టేషన్‌కి వెళ్ళి వస్తాను. మనకి సీట్ రిజర్వేషన్ ఏమయినా దొరుకుతుందేమో ప్రయత్నిస్తాను. బెర్త్ దొరికితే ఒకటే తీసు కుంటాను.''

''త్వరగా తిరిగిరండి. ఇంటాయన అరు స్తాడు లేకపోతే. అద్దె ఆయన మొహాన ముందర పడేస్తే సగం ప్రాణం కుదుట బడు తుంది.''

''సూట్‌కేస్‌లో బట్టలు సర్దిపుంచు. వారం రోజులయినా వుండాల్సి రావచ్చు''.

నరసింహం నాంపల్లి స్టేషన్‌కి వెళ్ళాడు. రిజర్వేషన్ కౌంటర్‌లో తనమిత్రుడు రమణారావ్ వుంటే బావుండును అనుకుంటూ వెళ్ళాడు.

నరసింహం అదృష్టవశాత్తు గోదావరి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కౌంటర్‌లో అతని మిత్రుడు రమణారావే వున్నాడు. అట్టే రష్ లేదు.

లోపలకి వెళ్ళాడు నరసింహం లోపల నుంచి తిరిగి. సాదరంగా విష్‌చేసాడు రమణారావ్.

''చిన్న సహాయం చేయాలండీ. విశాఖ పట్నానికి ఈరోజు సాయంత్రం గోదావరిలో ఒక బెర్త్, ఒక సీట్ రిజర్వేషన్ కావాలి' కోరాడు.

''ఎవరికి ?'' అడిగాడు రమణారావ్.

''నాకు, మా ఆవిడకి.''

''దొరకటం కష్టమండీ'' అన్నాడు రమణారావ్ ఇబ్బందిగా, కార్డెక్స్ తెరుస్తూ.

''దయచేసి సీట్స్ అయినా ఇప్పించాలి మీరు. ఇంటినుంచి టెలిగ్రాం వచ్చింది, మా అమ్మకి సీరియస్‌గా వుందని'' టెలిగ్రాం జేబులోంచి తీసి చూపించాడు తన మిత్రుడికి.

కార్డెక్స్ చూసి, చిన్నగా తల పంకించి అన్నాడు రమణారావ్,

"యు ఆర్ లక్కీ."

"ఉన్నాయా ?"

"ఒక సీట్ వుంది. వుదయం ఎవరో కేన్సిల్ చేసుకున్నారు. ఇంకొకటి బండి వచ్చాక ప్రయత్నించి కాని చెప్పలేను."

"ఎలాగయినా..." చాలా సేపు ప్రాధేయ పడి అన్నాడు నరసింహం,

"మీకు ఇవ్వాల్సిన వందలో పైసాకూడా ఇంతదాకా ఇవ్వలేక పోయినందుకు చిన్నతనంగా వుంది. ఊరినుంచి తిరిగిరాగానే ఇచ్చేస్తాను. నిజానికి మీకీ నెలలో బాకీ సగమయినా తీరుద్దామనుకున్నాను. కాని, అనుకోకుండా ఈ ప్రయాణం వచ్చిపడింది."

నరసింహం నొచ్చుకోవటం చూసి అన్నాడు రమణారావు కొద్దిగా జాలిగా,

"ముందర మీ అమ్మగారి ఆరోగ్యం కుదుట బడనీయండి."

నరసింహం డబ్బు అతనికి అందించి, ఎలాగయినా రెండోసీటుకూడా ఇప్పించేలాగ చూడమని కోరాడు. రైలు బయలుదేరే సమయానికి మళ్ళీ వచ్చి కలిసి టికెట్స్ చిల్లర తీసుకెళ్ళమని చెప్పాడు రమణారావ్, బయట క్యూ పెరగడంతో.

నాంపల్లిలో గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి పావుగంట ముందు వచ్చాడు నరసింహం తన సతీమణితో, సూట్ కేస్, నీళ్ళసీసాతో.

బుక్కింగ్ కౌంటర్‌లో రమణారావు స్థానంలో వున్న మరొకతన్ని విచారించగా, అతను నరసింహానికి ఓ కవరు అందించాడు,

"రమణారావ్ మీకిమ్మన్నాడు దీన్ని. ఆయన మళ్ళీ రేపు ఉదయం వస్తారు" చెప్పాడతను.

నరసింహం కవరు చింపాడు. లోపల రెండు టిక్కెట్లు, వైజాగ్‌కి, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో, ఆరోజుకి వుంటాయనుకున్నాడు.

లేవు !

బదులుగా, ఓ మడిచిన కాగితం వుంది. విప్పి చదివాడు నరసింహం, భార్య వినేలా గట్టిగా,

"డియర్ మిష్టర్ నరసింహం,

నా బాకీ ఇక వసూలుకాదనే భయంతో, స్వయంగా మీరు డబ్బు నాకు ఇచ్చే పద్ధతి ఆలోచించాను. వైజాగ్‌లోని ఓ స్నేహితుడి ద్వారా, మీ తండ్రిగా రిచ్చినట్టుగా, ఓ టెలిగ్రాం ఇప్పిచ్చాను, మీ జీతం అందే రోజున అది మీకుచేరే విధంగా. నే నూహించినట్లుగానే మీరు టికెట్స్ రిజర్వేషన్ కోసం నా దగ్గరికి వచ్చారు వంద రూపాయలతో. నా బాకీ తీరింది.

మీ ఇంట్లో అంతా క్షేమంగానేవున్నారు. హాయిగా ఇంటికి వెళ్ళండి. మీరు విశాఖపట్నం వెళ్ళాల్సిన పనిలేదు. మీకు మించిన ఆవసరాలు నాకీ నెలలో కలిగాయి కాబట్టే ఇలా చేయాల్సి వచ్చినందుకు మన్నించండి.

(మీ ఆవిడకు కోపం వచ్చి ఇక నన్ను మీ ఇంటికి భోజనానికిరానివ్వదని నాకు తెలుసు.)

యువర్స్ సిన్సియర్లీ,

రమణారావ్" *

అమెరికాకు స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1783-1819 సంవత్సరాల మధ్యకాలంలో, ఆ దేశానికి ఇతరదేశాల నుంచి వలస వెళ్ళినవారి సంఖ్య 2 లక్షల 50 వేలు.